# మాయదారి మగాడు

జి.ఎన్. సూరి

మధుసూదనాన్ని తను చేసిన తప్పు కృంగదీస్తోంది.

అతనీమధ్య తరుచు అన్యమనస్కంగా ఉంటున్నాడు. భార్య నిర్మలమైన ప్రేమాభిమానాలూ, నిండు మనసుతో అందించే సేవలు అతన్ని మరింత సిగ్గుపడేలా చేస్తున్నాయి.

"ఏమిటండీ ఈ మధ్య అదోలా ఉంటున్నారు? ఆరోగ్యం బాగోలేదా?" అందోళనగా అడుగుతూ వచ్చింది రేణుక అతని తీరు చూస్తూ.

మధుసూదనం సమాధానం చెప్పలేక పోయేవాడు.

"ఓవర్ టైము.... ఓవర్ టైమంటూ అర్ధరాత్రి వరకూ ఆఫీసు నుంచి కదిలిరాక పోవటం....ఆరోగ్యం పాడు చేసుకోవటం. మీకో దణ్ణం పెడ్తాను కాని....ఎంతవస్తే అంతటితోనే సంసారం గడుపుకోవచ్చు కాని వొళ్ళు మాత్రం గుల్ల చేసుకోకండి." ఆపుకుందామనుకున్నా ఆగని కన్నీటితో అర్ధింపుగా అంది రేణుక.

ఆ మాటలకు మధుసూదనం చలించి 'ఎంత అమాయకురాలు!....ఎంత ప్రేమ తనంటే!.... అటువంటి దాన్నా తను మోసం చేసేది?.... అర్ధరాత్రి వరకూ తన తిరుగుళ్ళు ఓవర్ టైము అని భావిస్తోందా ఆ పిచ్చిది?'

మధుసూదనం మనసు విలవిల లాడి పోయింది.

అతను మింగాలేక కక్కాలేక పోతున్నాడు. అలా అని తనకంటుకున్న జాడ్యాన్ని వదుల్చుకోనూ లేక పోతున్నాడు. అతను భార్యముందు నిలబడటానికి నేరస్థుడి మల్లే జంకుతున్నాడు.

ఆ రాత్రి నిద్రపోతున్న మధుసూదనం ఉలిక్కిపడి లేచాడు. నిశ్శబ్దమైన వాతావరణంలో ఎక్కిళ్ళ శబ్దం వినపడి ప్రక్కనే పడుకున్న భార్య మొహంలోకి వొంగి చూశాడు. రేణుక కళ్ళల్లోంచి ధారగా నీళ్ళు వర్షిస్తూంటే వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"రేణుకా....రేణుకా...." అన్నాడు భుజం కుదుపుతూ మధుసూదనం ఆందోళనగా.

"ఊఁ?"- అంది ఏడుస్తూనే రేణుక.

"ఏమిటి?....ఎందుకూ ఏడుస్తున్నావ్."

మధుసూదనం ప్రశ్నించాడు.

రేణుక జవాబు చెప్పలేదు.

అడిగాడన్న మాటేకాని మధుసూదనానికి తెల్సు భార్య కంటి నీరుకి తనే కారణం అని. తన మీద తనకే కోపం వచ్చింది మధుసూదనానికి. 'ఛ ఛ....ఎలా ఏడిపిస్తున్నాను!' మనసులోనే అనుకున్నాడు.

"రేణుకా!" అన్నాడు మెల్లగా మధుసూదనం.

రేణుక భర్తవైపు తిరిగింది.

మధుసూదనం క్షణం ఆలోచనల్లో పడ్డాడు.

చెప్పవల్సింది ఎలా చెప్పాలో తోచలేదతనికి. కాని, చెప్పి తీరాలి, ఇంక తను భార్య దగ్గర నేరస్థుడిలా ఉండలేడు.





అయినా అందం, ఆకర్షణ....అంతకు మించి అభిమానం, అనురాగం కాదని అడ్డదార్ని ఎందుకు పట్టాడో అర్థం కాలేదతనికి. ఉహు....ఇంక తను ఆదార్న పోకూడదు... తన ప్రేమా, తన అనురాగం అంతా భార్యకే చెందాలి. ఇంత వరకు తను చేసిన పాపం ఆమె ముందు ఒప్పుకోవాలి. తనను తాను ప్రక్షాళనం చేసుకోవాలి, మధుసూదనం మనసు ఓ నిర్ణయానికి వచ్చేసింది.

రేణుక భర్త మొహంలోకి చూస్తోంది.

ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు ఉన్న గంభీరమైన అతని మొహం ఆమెకు భయాన్ని కలిగించింది. తన కంట నీరు అతన్ని చికాకు పరిచిందా? తన జేలతనం అతనికి కోపం కలిగించిందా? ఏం చేస్తుంది? మనసుని నీరై పోకుండా ఎంత కాలం సముదాయిస్తుంది? .... అలసటతో నలిగి పోతున్న అతని మొహం, అతను అహర్నిశలూ పడే శ్రమా అవన్నీ చూస్తుంటే తనని తాను అదుపు చేసుకోలేక పోయింది. అంతే-ఎంత ఆపుకుందామనుకున్నా ఆగలేదు కన్నీరు. ఒక్క మాటు వరదై ఉరికింది. అతనికి నిద్రాభంగం కలిగించినట్లుంది, రేణుక ఆలోచిస్తోంది, ఆ ఆలోచన్ల నుంచి తేరుకొని—

"ఏమండీ?....మంచి నీళ్ళు కావాలా?" అడిగింది రేణుక.

చల్లటి నీళ్ళు తాగితే ఉద్వేగం తగ్గుతుందని ఆమె నమ్మకం.

కావాలన్నట్లు తలూపాడు మధుసూదనం.

ఆ కాస్త వ్యవధిలోనూ చెప్పదల్చుకున్న దాన్ని గురించి మరోసారి మననం చేసుకోవచ్చునని అతని ఉద్దేశ్యం. రేణుక గది మూలనున్న టీపాయ్ మీదున్న మంచి నీళ్ళ కూజా దగ్గరకు వెళ్ళింది.

ఆ కాస్త విరామంలోనూ అతని మనసు అటూ ఇటూ తెగ వూగిసలాడి పోయింది. భార్య అందించిన మంచినీళ్ళ గ్లాసు అందుకుని త్రాగి తిరిగి అదామె చేతికిస్తూ—

"రేణూ! నీకో విషయం చెప్పాలను కుంటున్నాను....చెప్పనా?" అడిగాడు.

రేణుక గ్లాస్ అందుకుంటూ ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా చూసింది.

"విన్న తర్వాత కోపగించు కోవటం— బాధపడటం లాంటివి చేయవుగా?"

రేణూకి ఈ మాటు ఆ విషయం మీద ఆసక్తి కలిగింది.

తనకి బాధ-కోపం కలిగించే విషయాలేమున్నాయి అతనిలో....ఆమె మనసుకు అంతు చిక్కలేదు.

మధుసూదనం కాసేపు ఆమె సమాధానం కోసం చూసి— "నా పిచ్చిగాని కోపమూ, బాధ కలిగించే విషయాలు చెబుతూ కలిగిస్తాయా అని అడగటం ఏమిటీ? అయినా ఈ అగ్నిగుండం నా హృదయంలో దాచుకోలేను. ఇది నన్ను నీ ముందర నిలబడ నీయికుండా చేస్తోంది. ......." అంటూ కాసేపు ఆగాడు.

రేణుకకు మతి పోయినట్లవుతోంది.

ఏమిటతను చెప్పబోయేది?....ఎందుకలా మథనపడి పోతున్నాడు? అంతగా అతని మనసుని నలిపేస్తున్న విషయం ఏమిటీ? రేణుక ప్రశ్నల సుడిగుండాల మధ్య ఉక్కిరి బిక్కిరైపోతోంది.


"రెండు మూడు నెలలుగా ఆఫీసునుంచి ఇంటికి ఆలస్యంగా రావటం నువ్వు గమనిస్తూనే ఉన్నావు కదూ రేణూ?....... ఓవర్ టైమంటూ దానికో సాకు కూడా చెబుతూ వచ్చాను. అసలు నిజం ఏమిటంటే నాకీమధ్య మా ఆఫీసులో పనిచేసే అనూరాధ అనే అమ్మాయితో సంబంధం ఏర్పడింది. ఆ....సంబంధం....అంటే....అంటే.... నీకీపాటికి నేను చెప్పదల్చుకున్నది అర్థం అయ్యే వుంటుంది. ఆ అమ్మాయితో తిరుగుళ్ళు, సినిమాలూ....ఇంకా....ఇంకా ....రేణూ! అదేం దిక్కుమాలిన ఆకర్షణో తెలీదు నన్నో పిచ్చివాణ్ణి చేసేసింది. నా కళ్ళను కప్పేసింది....నన్నో మూర్ఖుణ్ణి చేసేసింది. నిన్ను అమాయకురాల్ని చేసేసి నేను వేరే ఆడదానిలో సుఖాలు వెతుక్కోవటం ...ఛ...ఛ....నామీద నాకే అసహ్యం వేస్తోంది రేణూ!"

మధుసూదనం చెప్తోన్న దాన్ని తెల్లబోయి వింటోంది రేణుక.

"అనుభవం — ఆనందం ఎన్నో రకాలన్నట్లు మనిషి శ్రమ పడతాడు కాని.... ఉహు....అదొట్టి మూర్ఖత్వం.... అమాయకత్వం. అనూరాధకి నేనెలా బానిసనయ్యానూ అని ఆలోచిస్తే నాకు సరైన కారణం ఒక్కటీ మనసుకి తోచటంలేదు. నీకన్నా అందమైనదా? ....నీకంటే ఆకర్షణ ఏమైనా ఉందా?....... నీకంటె ప్రేమించగలదా? లేదు....లేదు నీ ముందు నూరో వంతు కూడా పోటీ పడలేదామె వీటిలో. నేను కాస్త నలిగిపోతే విలవిలలాడి పోయే నువ్వుండగా—నన్ను క్షణం క్షణం అమితంగా ప్రేమించే నువ్వుండగా ఎందుకు నేనలా అయిపోయాను అనుకున్న మరుక్షణం నుంచి నేను చేస్తున్నదీ....నేను నడుస్తున్నదీ ఎంత తప్పో—ఎంత తప్పుదారో తెలిసిపోయింది. అందుకనే రేణూ! ....అందుకే నేను చేసిన నేరం నీ ముందు ఒప్పేసుకుని నువ్వేశిక్ష వేసినా అనుభవించాలనుకున్నా. చెప్పు రేణూ! ఈ మూర్ఖుణ్ణి, ఈ అవివేకిని ఎలా శిక్షిస్తావో?

అయితే ఒక్క విషయం రేణూ!.... నేను చేసింది గొప్ప తప్పేకావచ్చు. ఆ తప్పుకు ఒకలా మానసిక క్షోభతో శిక్ష ఎలాగూ అనుభవించేను. నీ ప్రేమనూ-నీ అనురాగాన్నీ దూరం చేసేటంత పెద్ద శిక్ష వేయకు ప్లీజ్!" మధుసూదనం చెప్పవల్సిదంతా చెప్పేసి అర్థింపుగా అన్నాడు.

రేణుక కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి అతను చెప్పినదంతా వింటూంటే. ఆమెకు కోపం మాత్రం రాలేదు. అదోరకమైన బలహీనత. అది మనుషుల్లో అత్యంత సహజం. ఏదో బలహీనతకు....... ఏదో క్షణంలో లొంగిపోని వాళ్ళుండరు. అలాంటి లోపమే లేకపోతే మనుషులూ— దేవతలూ వేరు వేరు ఎందుకవుతారూ!



## పాట

అందం—ప్చ్...
ఎంత కమ్మని అబద్ధం
శిథిలం ఎప్పుడూ
పగిలిపోయిన మృదంగమే
అందమైన భ్రమ సుడి గాలిలా
పుష్కృతంగా పై కెగసి
క్రమేపీ పొగరు తగ్గి పిల్లగాలై
నాలోంచి నాదంగా జన్మిస్తుంది
నిరంతరం సజీవంగా ప్రవహించే
శబ్దం లోంచి
కనిపించని అందం
వినిపిస్తూ వుంటుంది.

వి. చంద్ర

ఒకలా రేణుకకు భర్తను చూస్తే చాలా ఆనంద మనిపించింది. తనది తప్పు అని అతి తక్కువ కాలంలో గ్రహించ గలిగే అతను నేరస్థుడెలా అవుతాడు? అతను మూర్ఖుడూ—అవివేకి ఎలా అవుతాడు. పైగా స్వచ్ఛందంగా తన నేరాన్ని అంగీకరించే ఆవ్యక్తి ఎంత నిర్మలుడు........ఎంత ఉత్తముడు?

రేణుక చటుక్కున భర్త చేతుల్ని అందుకుంటూ— "ఎంత మంచి వారు మీరు!" అంది.

మధుసూదనానికి ఆశ్చర్యం వేసింది. ఆమెకు కోపం రాలేదా?........ జరిగింది విన్నాక ఆమె కోపానికి ఆహుతై పోతాననీ—ఆమె శాశ్వతంగా తనకి దూరం అయి పోతుందనీ—తనని అసహ్యించుకుంటుందనీ—ద్వేషిస్తుందనీ అనుకుంటే ఇంత తేలిగ్గా క్షమించగల్గిందేమిటి? ఏమైనా మధుసూదనం మనసు తేలిక పడింది.

"నన్ను క్షమించినట్లే కదూ రేణుకా?" మధుసూదనం భార్య మొహంలోకి చూస్తూ అడిగాడు.

రేణుక తేలిగ్గా నవ్వేస్తూ "క్ష...క్షమించటం ఏమిటండీ? మీలాంటి వాళ్ళని చూసి ఏ ఆడదైనా గర్వపడుతుంది కాని...." అంది.

ఆ రాత్రి మధుసూదనం మనసుకు శాంతి చిక్కి హాయిగా నిద్రపోయ్యాడు. రేణుక మనసులో అశాంతి తలెత్తింది. ఆమెకి తను భర్త ముందు చాలా అల్పురాలి ననే భావం తలెత్తింది. అతనంత నిర్మలంగా ఉంటూంటే తను మాత్రం కల్మషాన్ని దాచుకుని జీవిస్తోంది?

ఆమెలో ఏవేవో జ్ఞాపకాలు తుఫానులై లేచాయి.

అవామె మనసునీ, ఆలోచన్లనీ అల్లకల్లోలం చేయసాగాయి. రేణుక ప్రశాంతంగా నిద్రపోతున్న భర్త మొహంలోకి చూసింది. అతని మొహం తేటగా వుంది. 'అవును మరి....తనని తాను కడిగేసుకుని పవిత్రత నింపు కున్నాడు' రేణుక అనుకుంది.

తన తప్పుని చెప్పుకుని క్షమార్పణ అడిగిన ఆవ్యక్తిలో మరొకరి తప్పుని క్షమించగలిగే గుణం వుండదా? రేణుకలో తలెత్తింది ప్రశ్న. ఏమో ఎందుకుండదు?....వుంటుంది....వుండాలి....రేణుక నిర్ధారణ చేసేసుకోసాగింది తనలోతను.

రేణుక పైన తిరుగుతున్న ఫేన్ కేసి చూస్తూ పడుకుంది.

ఆ ఫేన్‌లాగే ఆమెలోని ఆలోచన్లూ, జ్ఞాపకాలూ అతి వేగంగా కదులుతూ గందరగోళ పరుస్తున్నాయి.

భర్త అన్నట్లు అనుభవం - ఆనందం క్షణికం....కాని అది తెలుసుండీ కూడా మనిషి తప్పు చేయటం జరుగుతూనే వుంటుంది. యాదృచ్ఛికంగా జరిగిందనుకున్నా—అజ్ఞానం వలన జరిగిందనుకున్నా తను కూడా ఓ తప్పు చేసింది. అది....అది ఆడదాని జీవితాన్ని అగాధాల్లోకి విసిరేసే






**1981 Top Selling Novels**

జూలై విడుదలలు!

| | | |
|---|---|---|
| ప్రేమకాంతి | కొమ్మూరి వేణుగోపాలరావు | 15.00 |
| ప్రేమనక్షత్రం | ,, | 15.00 |
| (సినిమాగా రాబోతున్న నవల) | | |
| భూమి గుండ్రంగా వుంది | బీనాదేవి | 12.50 |
| రంగుల రామచిలక | పురాణం | 10.00 |
| అందగాడు | మాదిరెడ్డి సులోచన | 16.00 |
| దేవీ చంద్రగుప్త | ,, | 16.00 |
| కడుపుతీపి | కె. రామలక్ష్మి | 16.00 |
| గురుదక్షిణ | ,, | 12.50 |

Available at all Leading Book Shops

అడ్వాన్సు పంపిన V.P.P. లో పంపబడును

నవభారత్ బుక్ హౌస్
ఏలూరురోడ్, విజయవాడ-2
PIN: 520002. PHONE: 77587

తప్పు....అరిటాకులా పీలికలు చేసి చింతర వందర చేసే తప్పు....అయినా అదృష్ట మనుకోవాలో, మరేమనుకోవాలో ఆ తప్పును పిండెగానే చంపేసి....మధుసూదనాన్ని పొందగల్గింది తను.

అతని ప్రేమనీ — అభిమానాన్ని పరిపూర్ణంగా పొంది జరిగిన పీడ కలని మనసు తెరపైనుంచి తొలిగించి మధురమైన జీవితం గడుపుతోంది.

అప్పుడప్పుడు ఆ పీడకల మసక మసకగా మనసులో మెదలబోతే, బలవంతాన్న తెతర గొట్టేసేది.

కాని—ఇప్పుడు ఇన్నేళ్ళకు మధుసూదనం వలన ఆ జ్ఞాపకాల తెరలు కదిలాయి. అవి వేధిస్తున్నాయి. బాధిస్తున్నాయి. అతనిలాగే తనూ ఆ నిప్పుని హృదయంనుంచి తొలగించుకుని ఆ మంటను చల్లార్చుకోవాలా?....అలాగే ఆ చేదుని గరళంలా దాచుకుని అసహజమైన తీయదనం కురిపించాలా?

రేణుక మనసు సందేహ-సంశయాల మధ్య కొట్టుమిట్టాడి పోతోంది.

అలా అలా ఆలోచన్ల మధ్య చాలా సేపటికికాని నిద్ర పట్టలేదు రేణుకకు. ఆ నిద్రకూడా కలవర పరిచే కలత నిద్ర.

ఆ తర్వాత మధుసూదనం మామూలు మనిషయిపోయాడు. ఎప్పటిలాగే ఆఫీసు నుంచి సరాసరి ఇంటికి వచ్చేయటం—వస్తూ వస్తూ భార్యకి పువ్వులు తవటం చేస్తున్నాడు.

రేణుక పరిస్థితి అందుకు భిన్నంగా తయారయ్యింది. భర్త ఏదో కబుర్లు చెప్పబోతే పరాకుగా వూకొట్టటం....ఎక్కడో ఏదో ఆలోచిసూన్న దానిలా వుండిపోవటం చేస్తోంది.

నాలుగు రోజులు అలా గడిచేసరికి మానసిక సంఘర్షణకు తట్టుకోలేకపోయింది రేణుక. మగాడే తన తప్పుని దాచుకోలేక బయటికి వెళ్ళకక్కి పశ్చాత్తాపపడితే ఆడదానిగా తను రహస్యంగా అణిచిపెట్టి ఉంచటం అసహజంగా అనిపించిందామెకు.

పైగా భార్యాభర్తలమధ్య రహస్యాలు ఉండకూడదంటారు. దాపరికం అన్నది సంసారం సాఫీగా సాగనీయదు.

రేణుక ఈరకం ఆలోచన్లతో ఓరోజు భర్త సమక్షంలో కబుర్లలో ఉండగా—"మీకో విషయం చెప్తాను....నన్ను క్షమిస్తారా?" అంది మెల్లగా.

మధుసూదనం ఆశ్చర్యంలా మొహం పెట్టాడు.

"మీ కల్మషాన్ని మీరు కడిగేసుకుని ఎంతో స్వచ్ఛంగా అయ్యారు. ఎంతో ఉన్నతమైనవారుగా నా దృష్టిలో ఎదిగిపోయారు. నేనుకూడా నా కల్మషాన్ని బహిర్గతం చేసి నిర్మలత్వం నింపుకోవాలనుకుంటున్నాను...."

రేణుక చెప్తోన్నదీ—చెప్పబోయేదీ అర్థం కావడంలేదు మధుసూదనానికి. అయోమయంగా చూస్తూ వుండిపోయాడు.

రేణుక అతని ముఖకవళికల్ని పట్టించుకోవడంలేదు. తన ధోరణిలో తను చెప్పుకుపోతోంది—

"మంచీ-చెడూ, తప్పూ-ఒప్పూ మనుషులం కనుక మనల్ని అంటిపెట్టుకునే వుంటాయి. అందులో ఒక వయసు మరీ ముందూ వెనుక చూపులు లేకుండా ఉరకలేస్తుంది. అలాంటి వయసులో ఎందుకు చేసానో ఎలా చేసానో తెలియకుండా ఓ తప్పు చేసేశాను. అది అజ్ఞానమో—అమాయకత్వమో మరి నాకిప్పటికీ అంతుపట్టదు.

హైస్కూలు వదిలి కాలేజీ కొచ్చిన రోజుల్లో మాటలూ—మనసూ కొంకుతనానికి దారులు వెతుక్కునేవి. ఆడా—మగా మధ్య ఆకర్షణకు అంకురం వేసే సమయం అది.

నాతో చదివే; ఓ అబ్బాయి....పేరు రాజు....తెల్లగా....పొడుగ్గా చలాకీగా మాట్లాడుతూ కవ్విస్తూ నవ్విస్తూ ఉండేవాడు. అతనితో మాట్లాడటం—అతనితో కల్సి నడవటం తమాషాగా ఉండేది.





కాలేజీ వదలగానే ఇంటివరకూ కూడా వచ్చేవాడు. అతనలా వెంటపడి వస్తూంటే అదో రకమైన గర్వం-ఆనందం మనసుని ఊపేసేవి.

ఒకమాటు ఇంట్లో వాళ్ళందరూ పెళ్ళికి వెళ్ళారు. సాయంకాలానికి వచ్చేస్తారు కదా అని క్లాసులు చెడిపోతాయని నేను మాత్రం వెళ్ళలేదు.

కాని ఆరోజు మార్నింగ్ క్లాసులు అవ్వగానే కాలేజీకి సెలవు ఇచ్చేశారు. యథాప్రకారం ఇంటివరకూ నవ్వుతూ—నవ్విస్తూ రాజుకూడా వచ్చాడు.

"ఇవాళ కాఫీకి వస్తున్నాను!"—రాజు అన్నాడు ఇంటిని సమీపించగానే.

"రండి!" అప్రయత్నంగా అనేశాను.

"నిజంగా?" రాజు అడిగాడు.

ఇంట్లో ఎవరూ లేరు....పైగా బోర్ గా వుంది....రమ్మంటేనేం అనిపించింది, అలా అనుకోగానే—"అబద్ధంగా కూడా రమ్మంటారా?" అనడిగాను నవ్వుతూ....

రాజు నావెనుకే ఇంట్లోకి వచ్చాడు.

నేను కాఫీ తీసుకొచ్చాను.

కబుర్లు మొదలయ్యాయి....కవ్వింపులు మొదలయ్యాయి.

"ఆ కవ్వింపు....ఆ కవ్వింపు...."-రేణుక చెప్పటం ఆపేసింది.

మధుసూదనం కనుబొమలు ముడిపడ్డాయి. అతని హృదయం అదోలా కొట్టుకోవటం మొదలు పెట్టింది.

రేణుక మళ్ళీ మొదలు పెట్టింది—"రాజు వెళ్ళిపోయాడు - అతను వెళ్ళాక ఇలా జరిగిపోయిందేమిటన్న ఆలోచన వచ్చింది. ఏమైనా ఎంతాలోచించినా జరిగిపోయింది....అంతే!....జరిగిన విషయం ఎవరికైనా చెప్పాలా!....చెప్పి ఏం చేయాలి అన్న ఆలోచన నాకసలు రాలేదు. నెల తర్వాత పరీక్షలు అయిపోవటం ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోవటం జరిగింది.

రాజుతో కలసి చేసిన తప్పు ఒక రోజు ప్రొద్దుటే తన ఉనికిని తెలియ చేసింది. ప్రొద్దుటే లేచి బాత్ రూమ్‌కి వెళ్ళబోతే తల తిరిగి నట్లయ్యింది. నాకు భయం వేసింది. కాని ఏంచేయాలి?.

ఎంత దాచాలన్నా దాగని తప్పది.... అమ్మకీ నాన్నకీ తెల్సి పోయింది. అమ్మ ఏడ్చింది—నాన్నగారు ఇల్లెగిరి పోయేలా అరిచారు. మరో నిముషం తర్వాత మరింత అల్లరవుతుందని గాబోలు వోరుని అదుపు చేసుకున్నారు.

మరో వూళ్ళో నా తప్పుని పిండెగానే తుంచేసే ఏర్పాటు చేశారు.

ఆ పీడకలని సమాధి చేసి మీతో మధురమైన కలకు పునాది వేసుకున్నాను. సుఖాల కోసం ఆరాట పడటం — ఆవేశ పడటం ఎంత అవివేకమో అనిపిస్తుంది. మొన్నటి మీ సంఘటన విన్న తర్వాత అంతా ఒక భ్రమ అనిపిస్తుంది. నాకు మీ క్షమార్పణ కావాలి. మీ క్షమలో నేను పునీతమవాలి. ఏమంటారు?"—రేణుక భర్త ముఖంలోకి చూస్తూ వుండిపోయింది.

మధుసూదనం సమాధానం చెప్పలేదు.

○ ○ ○ ○

"అలాంటి దాన్తో నేనెలా కాపురం చేయగలను చెప్పండి లాయరు గారూ!.... ఒకసారి తప్పుచేసిన ఆ ఆడది మరోసారి తప్పు చేయకుండా ఉంటుందా? అందుకనే, అందుకనే నాకామె నించి విడాకులు కావాలి లాయరు గారూ!"—మధుసూదనం భార్య చెప్పిన కథ మాత్రమే లాయరుకి చెప్పి ఆయన జవాబు కోసం ఆతృతగా ఎదురు చూడ సాగాడు. ■